క్లుప్తంగా

నేత్రదానం


తియ్యబిండి ప్రసాద్(ఫైల్)

నెల్లూరు(అర్బన్): కావలి పట్టణం గుర్రంవారి వీధికి చెందిన తియ్యబిండి ప్రసాద్(69) శనివారం తెల్లవారుజామున ఆయన నివాసంలో మృతిచెందారు. స్థానికులు టి.కల్యాణ్‌కుమార్, శ్రీకాంత్‌ల సహకారంతో అభయం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు శ్రీవాణి ఆధ్వర్యంలో మృతుని భార్య హైమావతి ఆయన నేత్రాలను నెల్లూరు ప్రభుత్వ పెద్దాస్పత్రికి దానం చేశారు. దీంతో ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ సునీల్ మృతుడు ప్రసాద్ నేత్రాలను సేకరించి కుటుంబ సభ్యులకు సర్టిఫికెట్‌ను అందించారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ నేత్రదానం చేయదలిచిన వారు 99595 89321 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. ఇండియన్ రెడ్‌క్రాస్ కావలి చైర్మన్ రవికుమార్, వాసవి వనిత లెజెండ్ ప్రెసిడెంట్ దుగ్గిశెట్టి హేమలత పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన



నెల్లూరు (టౌన్): అరకు వ్యాలీలో నిర్వహించనున్న ట్రెక్కింగ్–2 క్యాంపునకు స్థానిక దర్గామిట్టలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఎన్‌సీసీ క్యాడెట్ కె.బ్రహ్మానిఖిల్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శనివారం స్కూల్లో ఎంఈఓ మురళీధర్, హెచ్‌ఎం కృష్ణారెడ్డి, ఎన్‌సీసీ ఆఫీసర్ ధనుంజయరావులు క్యాడెట్ బ్రహ్మానిఖిల్‌ను అభినందించారు.

నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం

నెల్లూరు(బృందావనం): సింహపురి గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి దేవస్థానంలో ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారోత్సవం శనివారం నిర్వహించారు. చైర్మన్‌గా ఒట్టూరు సురేంద్రయాదవ్, సభ్యులుగా అల్లం లక్ష్మి, తమ్మినేని వెంకటరత్నం నాయుడు, కొండా కోటేశ్వరరెడ్డి, చెంచయ్య, హరికుమార్, మన్నేపల్లి వెంకటలక్ష్మీప్రసూన, ముమ్మిడి కుమార్, మిడతల మహాలక్ష్మి, ప్రధాన అర్చకుడు చంద్రశేఖర్ ఎక్స్ అఫీషియో సభ్యులుగా ప్రమాణస్వీకారం చేశారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మాజీ మేయర్ భానుశ్రీ, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మాసశివరాత్రి

నెల్లూరు(బృందావనం): పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో భాద్రపద మాస శివరాత్రి సందర్భంగా సామూహిక ఏకాదశ పూర్ణవార రుద్రాభిషేకార్చనలు, దేవతలకు అభిషేకార్చనలు, శంకర భగవత్పాదులకు పుష్పార్చనలు శనివారం చేశారు. చక్రాలవారి ట్రస్ట్, ఆదిశంకర ధ్యాన మందిర కమిటీ ఆధ్వర్యంలో సమయానందనాథ, గుండాపంతుల రామసుబ్రహ్మణ్యశర్మ, అనిల్‌కుమార్‌శర్మ పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఉభయదాతగా చక్రాల లక్ష్మీరమణమూర్తి వ్యవహరించారు.

వాటర్ ట్యాంక్‌కు మరమ్మతులు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 53వ డివిజన్ వెంకటేశ్వరపురం పునరావాస కాలనీలో శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంక్‌కు మరమ్మతుల పనులు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ ట్యాంక్ మెట్లు విరిగిపోవడంతో అనేక చోట్ల పగుళ్లు ఏర్పడడంతో ప్రజలు భయాందోళనలు చెందారు. దీనిపై గత నెలలో 'ప్రమాదభరితంగా వాటర్‌ట్యాంక్' అనే శీర్షికన సాక్షిలో కథనం కూడా వెలువడింది. కాగా ఉదయం 6.30 నుంచి 9.30 వరకు పంప్‌హౌస్ నుంచి నేరుగా తాగునీటి సరఫరా ఉంటుందని, సాయంత్రం 3 నుంచి 6 గంటల వరకు ఇస్లామ్‌పేట, లంగర్‌తోట, హమాలీవీధి ప్రాంతాల్లో నీటి సరఫరా జరుగుతుందని అధికారులు తెలిపారు.

జిల్లా వాసులకు పదవులు


బి.నరేంద్రరెడ్డి


తుమ్మల రామిరెడ్డి

నెల్లూరు(అర్బన్): ఏపీ గ్రామీణ బ్యాంక్ పెన్షనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గంలో జిల్లా నేతలకు పదవులు దక్కాయి. గుంటూరులో జరిగిన రాష్ట్ర కార్యవర్గంలో నెల్లూరు నుంచి బి.నరేంద్రరెడ్డిని చీఫ్ అడ్వైజర్‌గా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కావలి పట్టణానికి చెందిన తుమ్మల రామిరెడ్డిని ఎన్నుకున్నారు. ఈ క్రమంలో వారు శనివారం మాట్లాడుతూ గ్రామీణ బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతామన్నారు.

ప్రహరీ ధ్వంసం

నెల్లూరు(క్రైమ్): స్థల వివాదం నేపథ్యంలో ప్రహరీని ధ్వంసం చేసిన ఘటనపై వేదాయపాళెం పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. వైఎస్సార్ నగర్‌కు చెందిన చంద్రమోహన్, సుధాకర్‌ల మధ్య స్థల వివాదం ఉంది. సుధాకర్ కుటుంబసభ్యులు శనివారం మధ్యాహ్నం చంద్రమోహన్ ఇంటి ప్రహరీని కూల్చివేశారు. ఈ మేరకు చంద్రమోహన్ వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మొక్కలు నాటడం ప్రతిఒక్కరి బాధ్యత

- కలెక్టర్ హిమాన్షు శుక్లా


అధికారులు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్

నెల్లూరు(బారకాసు): పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటడాన్ని బాధ్యతగా చేసుకోవాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక బీవీ నగర్‌లోని పార్కులో కలెక్టర్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్రలో సుమారు 5 లక్షల మంది పాల్గొన్నట్టు పేర్కొన్నారు. నవంబర్ మాసంలో వర్షాలు రానున్న నేపథ్యంలో ఈనెల 17 నుంచి అక్టోబర్ వరకు స్వచ్ఛత సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు కూడా స్వచ్ఛందంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. నగర పరిధిలో ఇంటింటి నుంచి చెత్త నిరంతరాయంగా జరుగుతుందని, ప్రజలు కూడా తమ వంతులో భాగంగా తడి, పొడి చెత్తను వేరు చేసి అందించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, నగరపాలక సంస్థ కమిషనర్ నందన్, హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక డీకే డబ్ల్యూ కాలేజీలో కలెక్టర్ మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

- **నెల్లూరురూరల్:** స్వచ్ఛాంధ్ర– స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ పరిసరాలను సిబ్బంది శనివారం శుభ్రం చేసి మొక్కలు నాటారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీఆర్వో విజయ్‌కుమార్, ఏఓ విజయ్ కుమార్ పాల్గొన్నారు.
- **నెల్లూరు (బారకాసు) :** ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని నగరపాలక కమిషనర్ నందన్ పిలుపునిచ్చారు. స్థానిక 14, 28 డివిజన్లలో ఆయన శనివారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ మొక్కల పెంపకాన్ని ఆదర్శంగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కర్తం ప్రతాప్‌రెడ్డి, వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, రాష్ట్ర వేర్‌హౌస్ కార్పొరేషన్ డైరెక్టర్ కప్పిర శ్రీనివాసులు సిబ్బంది పాల్గొన్నారు.
- **నెల్లూరు(క్రైమ్):** పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని ఏఎస్పీ సీహెచ్ సౌజన్య పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా పోలీస్ అధికారులు స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. జిల్లా పోలీస్ కార్యాలయంతో పాటుగా పలు పోలీస్‌స్టేషన్‌లలో సుమారు 500 మొక్కలు నాటారు. స్వచ్ఛత, శుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు సంరక్షణ బాధ్యతలు తీసుకోవడం ద్వారా భవిష్యత్ తరాలకు మంచి వాతావరణాన్ని అందించవచ్చన్నారు. కాలుష్య నివారణకు ప్రతి ఇంటి ఆవరణలో మొక్కలు నాటాలన్నారు. అనంతరం పోలీసు కార్యాలయం వద్ద మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్, ఎస్‌బీ–2, దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్‌లు బి.శ్రీనివాసరెడ్డి, ఎం.రోశయ్య, ఆర్‌ఐలు రాజారావు, హరిబాబు, వివిధ కళాశాలల విద్యార్థినులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
- **నెల్లూరు(బారకాసు):** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం జీవితంలో భాగం కావాలని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. నుడా కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలో చెత్తను శుభ్రం చేశారు.
- **నెల్లూరు(అర్బన్):** పర్యావరణాన్ని ప్రతిఒక్కరూ కాపాడుకోవాలని సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి అన్నారు. నగరంలోని ఆస్పత్రి ఆవరణలో పరిసరాలను శనివారం పరిశుభ్రం చేసి, మొక్కలు నాటారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సకాలంలో వర్షాలు రావాలన్నా, భూతాపం తగ్గించాలన్నా పర్యావరణాన్ని కాపాడుకోవాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని ఆపాలన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ కో–ఆర్డినేటర్ మడపర్తి శ్రీనివాసులు, డాక్టర్ మస్తాన్‌బాషా, డాక్టర్ కళారాణి, ఏడీ ఏడుకొండలు, ఇతర డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.
- **నెల్లూరు(పొగతోట):** జిల్లా పరిషత్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జెడ్పీ సీఈఓ మోహన్‌రావు ఆధ్వర్యంలో మొక్కలు నాటి, పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ విజయ్‌భాస్కర్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.
- **నెల్లూరు(వీఆర్సీసెంటర్):** నగరంలోని డీసీఓ కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీఓ గుర్రప్ప సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించి కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలన్నారు. సహకార శాఖ సిబ్బంది, సంఘాల సభ్యులు పాల్గొన్నారు.


కలెక్టరేట్‌లో..


ఏసీనగర్‌లో మొక్క నాటుతున్న కమిషనర్


ప్రభుత్వాస్పత్రి ఆవరణలో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న డాక్టర్లు


జిల్లా పోలీస్ కార్యాలయంతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏఎస్పీ


జిల్లా పరిషత్ కార్యాలయంలో..


డీసీఓ కార్యాలయ ప్రాంగణంలో..

రైతులను ఆదుకోవాలి



నెల్లూరు(అర్బన్): జిల్లాలో రెండో పంట ధాన్యాన్ని మిల్లర్లు మద్దతు ధరకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకొని రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు చిరసాని కోటిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో కలెక్టర్ హిమాన్షు శుక్లాకు శనివారం వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. ఏటా రెండో పంట ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసేదన్నారు. అయితే గతేడాది నుంచి రెండో పంట ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదన్నారు. ఫలితంగా దళారులు, మిల్లర్లు కుమ్మక్కై రైతులను దోచుకుంటున్నారన్నారు. జిల్లాలో ఇప్పటికే 50 శాతం కోతలు పూర్తయ్యాయన్నారు. మద్దతు ధరకన్నా పుట్టికి రూ.2 వేలు నుంచి రూ.4 వేలు తగ్గించి కొనుగోలు చేశారన్నారు. అయితే ఇప్పుడు వర్షాలు పడుతున్న నేపథ్యంలో ఎంటీయూ 1010 రకం ధాన్యాన్ని కనీస మద్దతు ధర కన్నా రూ.6,720లు తగ్గించి కేవలం రూ.13 వేలకే కొనుగోలు చేస్తున్నారన్నారు. కేఎన్ఎం 1638 రకానికి రూ.4,720లు తగ్గించి కొనుగోలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా రైతులకు మేలు చేయాలని కోరారు.

కొనసాగుతున్న నిరసన

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ఆ జేఏసీ నేత శ్రీనివాసులు హెచ్చరించారు. నగరంలోని విద్యుత్ భవన్ వద్ద జేఏసీ నాయకులు రెండో రోజు శనివారం రిలే నిరాహార దీక్ష కొనసాగింది. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దామోదర్, శ్రీనివాసులు, నజీర్‌ఖాన్, వెంకటేశ్వర్లు, రఫీ, నవాజ్‌జాన్, హజరత్‌వలీ, కృష్ణ, రమణారెడ్డి నాంచారయ్య, ఫిరోజ్ పాల్గొన్నారు.

ఆమంచర్లలో వైద్య శిబిరం



నెల్లూరు సిటీ: రూరల్ పరిధిలోని ఆమంచర్ల గ్రామంలో వైద్యాధికారి డాక్టర్ పి.రవీంద్రనాథ్‌రెడ్డి, డాక్టర్ యూసఫ్‌ల ఆధ్వర్యంలో మహిళల కోసం ప్రత్యేక వైద్య శిబిరాన్ని శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల ఆరోగ్యంపై అవగాహన పెంచడం, వైద్యసేవలు అందించడం స్వస్థ్ నారీ– సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమ ఉద్దేశమన్నారు. కాగా వైద్య శిబిరంలో మహిళలకు గుండె, మధుమేహం, రక్తపోటు, నోటి కేన్సర్, రొమ్ము కేన్సర్, గర్భాశయ కేన్సర్ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి బి.పెంచలయ్య, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బట్టేపాటి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

27న కవి సమ్మేళనం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): మహాకవి గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా ఈనెల 27వ తేదీ సాయంత్రం కవి సమ్మేళనం ఉంటుందని మహాకవి తిక్కన్న సాంస్కృతిక వేదిక కన్వీనర్ పుల్లయ్య అన్నారు. నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో శనివారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. నగరంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలతో పాటు 28న 6 నుంచి పదో తరగతి విద్యార్థులకు పద్యపఠన పోటీలు, అదేరోజు బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు. సమావేశంలో జయరామిరెడ్డి, మాదాల రాము, నారాయణమూర్తి, నగేష్ పాల్గొన్నారు.

ఆనం విజయకుమార్‌రెడ్డి పరామర్శ



నెల్లూరు సిటీ: వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లేబూరు పరమేశ్వర్‌రెడ్డి సోదరుడు గోపాల్‌రెడ్డి ఆకస్మికంగా మరణించారు. ఈ క్రమంలో కోడూరుపాడులోని వారి నివాసంలో ఆయన భౌతికకాయానికి వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి శనివారం వెళ్లి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు చెవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఒకటో డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపట్నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు


మహాలక్ష్మి దేవస్థానంలో ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ


కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో..

నెల్లూరు(బృందావనం): ఏసీ నగర్ కోదండరామపురంలోని మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో ఈనెల 22వ తేదీ సోమవారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు శరన్నవరాత్రి మహోత్సవాలు ఉంటాయని పాలకమండలి చైర్మన్ పత్తి నరసింహం తెలిపారు. దేవస్థానంలో శరన్నవరాత్రి మహోత్సవాల ఆహ్వాన పత్రికలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోమవారం ఉదయం 9 గంటలకు కలశస్థాపన, నవావరణ, అష్టోత్తర సహస్ర నామ పూజలు నిర్వహించనున్నామన్నారు. అక్టోబర్ 2వ తేదీ వరకు అమ్మవారు గాయత్రి, భవాని, అన్నపూర్ణ, చండీ, గజలక్ష్మి, ధనలక్ష్మి, మహాలక్ష్మి, సరస్వతి, దుర్గా, మహిషాసురమర్ధిని, రాజరాజేశ్వరి అలంకారాల్లో భక్తులకు దర్శనమిస్తారు. 26, 30 తేదీల్లో ఉదయం 10 గంటలకు సామూహిక కుంకుమ పూజలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు వాసిపల్లి నారాయణరెడ్డి, దామెర చంద్రమౌళి, నూతేటి వెంకటేశ్వర్లు, ఎర్రా వెంకటసుబ్బయ్యనాయుడు, పత్తి శ్రీనివాసులు, తుమ్మల శ్రీనివాసులురెడ్డి, కాటేపల్లి వెంకటరమణయ్య, చిమ్మిరి గోవిందరాజులు, ఎర్రా వీరరాఘవులు, మలుచూరి చంద్రారెడ్డి, పత్తి రాము తదితరులు పాల్గొన్నారు.

- స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో సోమవారం నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగనున్నాయని ధర్మకర్తల మండలి చైర్మన్ కోట గురుబ్రహ్మం, కార్యనిర్వాహక అధ్యక్షుడు శేగు షణ్ముఖరావు, గౌరవ సలహాదారు మట్టా ప్రసన్నాంజనేయులు తెలిపారు. ఈ మేరకు దేవస్థానంలో ఆహ్వాన పత్రికలను శనివారం ఆవిష్కరించారు. తొలిరోజు ఉదయం 7 గంటలకు 1,008 మంది మహిళలు కలశాలతో రంగడి సన్నిధి నుంచి స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకాపరమేశ్వరి దేవస్థానం వరకు నగరోత్సవంగా తరలి రానున్నారన్నారు. పాల్గొనే భక్తులకు కుబేర వెండిప్రతిమను కానుకగా ఇవ్వనున్నామన్నారు. అక్టోబర్ 3వ తేదీ వరకు అమ్మవారు పలు అలంకారాల్లో భక్తులను అనుగ్రహించనున్నారని వివరించారు. కమిటీ ప్రధాన కార్యదర్శి నిచ్చెనమెట్ల చిరంజీవి, కోశాధికారి వొమ్మిన జనార్ధన్‌రావు, సహాయ కార్యదర్శి మునగా వెంకటేశ్వర్లు, సభ్యులు రాజాహజరత్‌బాబు, వాయుగుండ్ల బ్రహ్మయ్య, తన్నీరు కిశోర్‌కుమార్, దగ్గుమాటి మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్‌పై అవగాహన


మాట్లాడుతున్న ఏపీసీ వెంకటసుబ్బయ్య

నెల్లూరు (టౌన్): స్థానిక దర్గామిట్టలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఒకేషనల్ ట్రైనర్లకు దసరా సెలవుల్లో నిర్వహించనున్న ఇంటర్న్‌షిప్‌పై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య హాజరై, మాట్లాడుతూ ఇంటర్న్‌షిప్ కార్యక్రమం వల్ల విద్యార్థుల్లో ప్రాక్టికల్ నాలెడ్జ్ పెరుగుతుందన్నారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలో అధిరోహిస్తారన్నారు. కార్యక్రమంలో బాలికా శిశు సంక్షేమాధికారి మమత, ఎంఈఓ మురళీధర్, ఏపీఓ ప్రసాద్, ఒకేషనల్ కోఆర్డినేటర్స్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్‌గా రంగారావు కొనసాగింపు


వి.రంగారావు

నెల్లూరు (లీగల్): నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్(ఎన్ఎంసీ) స్టాండింగ్ కౌన్సిల్‌గా వి.రంగారావును మరో ఏడాది పాటు కొనసాగిస్తూ కమిషనర్ నందన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది అయిన రంగారావు గత మూడేళ్లుగా ఎన్ఎంసీ స్టాండింగ్ కౌన్సిల్‌గా కొనసాగుతున్నారు. ఈయన నగరపాలక సంస్థకు సంబంధించిన న్యాయపరమైన విషయాల్లో సర్వీసు చేసుకునేందుకు, స్థానిక కోర్టులో సంస్థ తరఫున కేసులు, చార్జిషీట్ దాఖలు చేయడం, చట్టపరమైన వ్యవహారాలపై కేసులు వాదించేందుకు నియమించుకోవడమైందని ఉత్తర్వులో పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు ఈయనకు గౌరవ వేతనంగా నెలకు రూ.25 వేలు చెల్లించడం, లేక ఎప్పటికప్పుడు ప్రభుత్వ సూచనలకు లోబడి గౌరవ వేతనం చెల్లిస్తామన్నారు. ప్రతి న్యాయ సలహాకు, ఆస్తి, నీటి, పన్నులు, ట్రేడ్ లైసెన్స్ కేసులకు సంబంధించి నెల్లూరులో జరిగే లోక్ అదాలత్‌లో వాజ్యం దాఖలు చేసిన ఒక్కో కేసుకు రూ.1000 చొప్పున చెల్లిస్తారన్నారు.

మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలివ్వాలి


మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న సీపీఐ నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): పెరమన సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియాను ప్రభుత్వం చెల్లించాలని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు దామా అంకయ్య డిమాండ్ చేశారు. గుర్రాలమడుగు సంఘం ప్రాంతానికి చెందిన బాలవెంగయ్య, సారమ్మలు రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా వారి కుటుంబాలను సీపీఐ నాయకులు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా దామా అంకయ్య మాట్లాడుతూ ప్రమాదానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు నష్టపరిహారంతో పాటు కుటుంబంలో ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సిరాజ్, షాన్‌వాజ్, ఏఐటీయూసీ నాయకులు శంకర్‌కిశోర్, శేఖర్, ముక్తియార్, సుబ్బరాయుడు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రీ రిపబ్లిక్ డే క్యాంపునకు గురుచరణ్


గురుచరణ్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఎన్‌సీసీ ఆఫీసర్

నెల్లూరు (టౌన్): గుంటూరులో 10 ఆంధ్రా నావల్ గ్రూపు కమాండర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రీ రిపబ్లిక్ డే వేడుకలకు స్థానిక వెంగళరావునగర్‌లోని మున్సిపల్ స్కూల్ ఎన్‌సీసీ క్యాడెట్ పెరంకొండ గురుచరణ్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థి గురుచరణ్‌కు శనివారం పాఠశాల హెచ్‌ఎం మంజులవాణి, ఎన్‌సీసీ సెకండ్ ఆఫీసర్ నరేంద్రబాబులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

ఇష్టానుసారంగా కోతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామని విద్యుత్ అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో ప్రజలకు కోతల కష్టాలు తప్పడం లేదు. నగరంలోని వెంకటేశ్వరపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 గంటల ప్రాంతంలో విద్యుత్ లైన్లు తెగిపోవడంతో సరఫరాలో నిలిచింది. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో సరఫరాను పునరుద్ధరించినా మళ్లీ 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రధానంగా వెంకటేశ్వరపురం, గాంధీగిరిజన కాలనీ విద్యుత్ ఫీడర్లలో విద్యుత్‌లైన్లు తెగిపోవడం తోనే ఈ సమస్య తలెత్తింది.

రాజరాజేశ్వరి దేవస్థాన ఉత్సవ కమిటీ ఏర్పాటు

నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఈనెల 22వ తేదీ నుంచి జరుగనున్న శరన్నవరాత్రి మహోత్సవాల నిర్వహణకు సంబంధించి ఉత్సవ కమిటీని శనివారం ఏర్పాటు చేశారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్‌పర్సన్‌గా ఏలూరు శిరీష, వైస్ చైర్మన్‌గా గూడంశెట్టి దొరబాబు, కార్యదర్శిగా బిరదవోలు చంటి, సభ్యులుగా నరేష్, దావులూరి జమున, మానికల నాగమణి, తేజ, రావూరు రాధాకుమారి, నాటకరాణి చినపెంచలయ్య, కల్లూరు వీరరాఘవేంద్ర నియమితులయ్యారు.

కమిషనర్ పర్యటన

నెల్లూరు(బారకాసు): స్థానిక జీఎన్టీ రోడ్డు, కేవీఆర్ పెట్రోల్ బంక్ కూడలి ప్రాంతంలో కమిషనర్ నందన్ శనివారం పర్యటించారు. వర్షపు నీరు నిలువకుండా, ట్రాఫిక్ అంతరాయాలు, రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాలువల్లో పూడికతీత పూర్తిస్థాయిలో చేపట్టి నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగం ఎస్‌ఈ రామోహన్‌రావు, ఏఈ ఫాజిల్, సిబ్బంది పాల్గొన్నారు.

పంటల బీమాపై అవగాహన కల్పించండి


మాట్లాడుతున్న డీఏఓ

నెల్లూరు(పొగతోట): పంటల బీమా పథకంపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని డీఏఓ సత్యవాణి అధికారులకు సూచించారు. వ్యవసాయ పరిశోధనా క్షేత్రంలోని సమావేశ మందిరంలో పంటల బీమా పథకం, పంటకోత ప్రయోగాలపై శనివారం అధికారులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రైతులందరూ పంటల బీమా పథకంలో చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు.

కలెక్టర్‌ను కలిసిన వీఆర్వో సంఘ నాయకులు


పూలమొక్కను అందజేస్తున్న సంఘ నాయకులు

నెల్లూరురూరల్: నూతన కలెక్టర్ హిమాన్షు శుక్లాను ఆయన కార్యాలయంలో గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సంఘ జిల్లా అధ్యక్షుడు పంట అశోక్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శి దారా రమణయ్య, డివిజన్ అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు, వీఆర్వోలు జగదీష్, రాజేశ్వరి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

- కలెక్టర్ హిమాన్షు శుక్లాను ఆయన కార్యాలయంలో న్యాయవాది, సామాజిక వేత్త ఇర్ల వెంకటరమణయ్య శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో కొండలరావు పాల్గొన్నారు.

